# ప్రేమ, శృంగారం, శరీరం

రాత్రి పదిగంటలైంది. పడక గదిలో కూర్చున్నాను. విశాలమైన పందిరి మంచం శృంగారంగా అలంకరింపబడి వుంది. రకరకాల పూలదండలు సువాసన వెదజల్లుతూ కళాత్మకంగా వేలాడుతున్నాయి. శృంగారమైన బొమ్మలున్న పరుపు మీద వెదజల్లిన మల్లెలు, నవదంపతులను ఆహ్వానిస్తున్నాయి. గదంతా సుగంధ ద్రవ్యాలు విరజిమ్ముతున్న సువాసనలతో గుబాళిస్తోంది.

నాకు నిన్ననే పెళ్ళయింది. ఈ రాత్రి నా సంసార జీవితానికి మొదటి రోజు. నా భార్య సృజనతో కలుస్తాను. సృజన చాలా అందంగా ఆకర్షణీయంగా వుంటుంది. ఎత్తుగా, సన్నంగా సౌష్ఠవంగా వుంటుంది. కోల మొహం, లేతపెదాలు, మెరుపులు కురిసే కళ్ళూ,సన్నని ముక్కూ కళాత్మకంగా కదుపుతూ సృజన చిరునవ్వులు కురుస్తూ వుంటుంది. చక్కగా, పొందిగ్గా, నిదానంగా, స్పష్టంగా దాపరికం లేకుండా మాట్లాడుతుంది.

'అందమైన అమ్మాయిని పట్టేశావురా! ఇంజనీరింగు డిగ్రీవున్న అమ్మాయిని పట్టేశావురా!' అని స్నేహితులందరూ నిన్నంతా నా చెవుల్లో గుసగుసలాడుతూనే వున్నారు.

"సృజన 'శృంగారం' అనే మాటకు నిర్వచనంలా వుంది!" అని చెవిలో ఊదేసింది వనజ.

ఈ మధుర క్షణాల్లో సృజన శృంగార చిత్రం నా కళ్ళముందు శృంగారంగా ఎందుకు కదలలేదు! నా మనసులో మధురంగా ఎందుకు మెదలలేదు! వనజ నా మనసులో ఎందుకు కదులుతోంది! నా కళ్ళముందు చిలిపిగా ఎందుకు మెదులుతోంది! ఈ మధురక్షణాల్లో సృజనతో మధురంగా నింపుకోవలసిన నా మనసును ఆలోచన్లను చిలిపి వనజ పక్కదారి పట్టించేస్తోంది! వనజను నా మనసులోంచి బయటకు నెట్టలేకపోతున్నాను!

వనజను నేను ప్రేమించేనా? లేదు. ఆమెతో ఎప్పుడైనా మధురమైన మాటలు చెప్పేనా? లేదు. ఆమెను ఎప్పుడైనా మధురంగా ముద్దు పెట్టుకున్నానా? లేదు. ఆమె శరీరాన్ని స్పృశించేనా? లేదు. ఆమెతో నాకు ఏమైనా అలాంటి సంబంధం

వుందా? లేదు కాక లేదు. ఈ మధుర క్షణాల్లో ఆమె ఎందుకు నా మనసు పట్టుకుని పీకుతోంది!? తెలీదు! తెలీదు!!

'నువ్వు పవిత్రమైన జీవితం గడుపుతున్నావనుకుంటున్నావు! అది నిజం కాదు! యవ్వనంతో పొంగుతున్న వయసులో అందరూ మానసిక వ్యభిచారులే!' అని వనజ ఎప్పుడో ఒకసారి అంది. ఎప్పుడందంటే - బి.ఇ. ఆఖరి సంవత్సరంలో వున్నప్పుడు అంది. అంటే ఏడు సంవత్సరాల కిందట ఆ మాట అంది. ఆ మాటలు ఇప్పుడు గుర్తుకు రావడం ఎందుకో!? వనజ ఇప్పుడు నన్నెందుకు ఇలా బాధపెడుతోంది!? ఆమెకు నన్ను అల్లరి పెట్టడం - బాధ పెట్టడం - ఎప్పుడూ సరదాయే! ఆమె ఎప్పుడూ అంతే!

ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజిలో కంప్యూటర్ సైన్స్‌లో ఇద్దరం ఒకేసారి చేరాం. వనజకి అల్లరి పెట్టడంలో వున్న తెలివితేటలు చదువులో లేవు! పెద్దగా చెప్పుకోవాల్సినంత అందంలేదు. కానీ చురుకుతనం వుంది. ఏమాటా మనసులో దాచుకోదు. భయంలేదు. బాగా ఆస్తి వున్న పెద్ద వ్యాపార కుటుంబం ఆమెది.

ఛ!ఛ!ఛ! ఈ మధుర క్షణాల్లో వనజ గురించి ఆలోచన్లు నాకెందుకు!? సృజనా! నువ్వొచ్చి నా మనసులో మెదులుతూ నా మనసుని దోచుకోవా? వనజను పీకపట్టుకుని నా మనసులోంచి బయటకు విసిరేయవా?

నాముందే నాకు వినపడేటట్టు వనజ ఇవాళ సాయంకాలం సృజన చెవిలో గుసగుసలాడింది. "అమ్మాయిల వాసనకు దూరంగా, చాలా చాలా దూరంగా వుంటూ కాలేజి చదువు వెలగబెట్టాడు! పవిత్రమైన జీవితం గడిపాడు! పాపం! ఏమీ తెలీని మంచివాడు! అన్నీ నువ్వే చెప్పుకోవాలేమో!" ఆ మాటలు చెప్పి సృజనకు గిలిగింతలు పెట్టి వెళ్ళిపోయింది.

వనజకి ఎవరూ కొత్తవాళ్ళుగా వుండరు. ఎంతో పరిచయమున్నట్టు అందరితోనూ చనువుగా చొరవగా గలగల మాట్లాడుతుంది. ఇప్పుడు ఆమె ఇద్దరి పిల్లల తల్లి! ఆ చిలిపితనం పోలేదు! ఆమె ఎప్పుడూ పచ్చగా వుండగలదు! జీవితంలో పచ్చతనం పండించుకుంటూ ఎప్పుడూ యవ్వనంగా వుండగలదు!

మాది చాలా బీదకుటుంబం. చిన్న పల్లెటూళ్ళో పుట్టి పెరిగేను. పన్నెండో సంవత్సరం దాటేవరకూ బస్సు ఎక్కలేదు. నాకు చదువు పట్ల శ్రద్ధ - పట్టుదల - కృషి - ఎక్కువ. నా చదువు ఎంతో కష్టంమీద సాగింది. కుటుంబ సభ్యులందరూ

ఇబ్బందులు పడ్డారు. నేను చదువు ప్రారంభించిన నాటి నుంచి మొదటి మూడు ర్యాంకుల్లో ఏదోవొకటి నాకు లభిస్తూ వుండేవి. చదువు సాగిస్తూ, సాయంకాలం పెదవాల్తేరులో ముగ్గురి ఇళ్లకు వెళ్లి చదువు చెబుతూ కొంత సంపాదిస్తూ వుండేవాణ్ణి.

పెదవాల్తేరు అనే మాట రాగానే మళ్లీ వనజ నా మనసులో ప్రవేశించింది! వనజా! నన్ను అల్లరి పెట్టకుండా వెంటనే నా మనసులోంచి బయటకు వెళ్ళిపోవా? సృజన చోటుని నువ్వు దురాక్రమణ చేస్తున్నావు! నీకూ నాకూ ఏ విధమైన సంబంధం లేదు. నీలాగే ఎందరో అమ్మాయిలు నాతోపాటు చదివేరు. వాళ్ళెవరూ నీలాగ నన్ను అలజడి పెట్టలేదే! ఎందరో అబ్బాయిలు నాతోపాటు చదివేరు. వాళ్ళెవరూ నీలాగ అల్లరి పెట్టలేదే! చాలామంది పేర్లు కూడా మర్చిపోయాను. అబ్బబ్బ! నీ గురించి ఆలోచన్లు ఈ మధురక్షణాల్లో నాకెందుకు!? ఈ అలజడంతా నాకెందుకు!? అర్థంలేని ఆలోచన్లు! సందర్భంలేని ఆలోచన్లు! చెత్త ఆలోచన్లు! ఇప్పుడు నేనింక దేని గురించి ఆలోచించను. ఎవరి గురించీ ఆలోచించను. ప్రేమమయ శృంగారంలో మిల మిల మెరుస్తున్న సృజనను ఎంచక్కా నా మనసు నిండా నింపుకుని ప్రేమమయ శృంగారభరితమైన భావజాలంలో ఉయ్యాల ఊగుతాను! సృజన ఎంత అందంగా వుంది! పొడవైన సన్నని చేతివేళ్ళు ఎంత మృదువుగా కళాత్మకంగా వున్నాయి! పెళ్ళి సందర్భంలో చాలాసార్లు ఆమె వేళ్ళు పట్టుకున్నాను! సృజనా! నీ ప్రేమమయ శృంగార సౌందర్యం నా మనసుని ఎందుకు దోచుకోవడంలేదు!!

వనజ నా కళ్ళముందు ఎందుకు కదులుతోంది? ఆమె పిచ్చిది! కాదు కాదు! నేనే పిచ్చివాణ్ణి!

ఒకరోజు... ఆ రోజు... పిల్లలకు చదువుచెప్పి, బస్సుకోసం పెదవాల్తేరు జంక్షనులో నిలబడ్డాను. వనజ నన్ను చూసి స్కూటర్ ఆపి పిలిచింది.

"పిల్లలకు చదువు చెబుతున్నావటగా!"

'అవును'.

'ఎందుకోసం?'

'డబ్బుకోసం!'

'విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నావు!'

'చదవడం వేరు. చదువు చెప్పడం వేరు! చదువు చెప్పడం విశ్రాంతిలాంటిదే!'

'క్లాసు తీసుకోకు!'

చిరునవ్వు నవ్వి మౌనంగా ఉండిపోయాను.

'పెద్ద అమ్మాయిలకు చదువు చెప్తే మరీ ఎక్కువ విశ్రాంతిగా వుంటుంది!'

మౌనంగా వుండిపోయాను.

'నువ్వు తప్పుగా భావించకపోతే ఒకమాట చెప్తాను. నువు మన కాలేజికి మంచిపేరు తెస్తున్నావు. మన లైబ్రరీలలో వున్న పుస్తకాలన్నీ పాత పుస్తకాలు. ఆ పుస్తకాల్లో కూడా పనికొచ్చే పేజీలన్నీ మాజీ విద్యార్థులు ఎప్పుడో చింపేసుకుని పట్టుకుపోయారు. కొత్తగా వస్తున్న పుస్తకాలు కొని చదవాలి. మాది ఆర్థికంగా స్తోమతకల వ్యాపారస్తుల కుటుంబం. ఒక మంచి విద్యార్థికి సాయం చేయడంలో నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. ఈ పదివేలూ నీ దగ్గరుంచుకో, నువ్వు తీసుకోకపోతే నన్ను అవమానించినట్టే అనుకుంటాను!'

'క్షమించు! ఒద్దు! అందులో నాకు తృప్తి వుండదు. అది నా ఆత్మవిశ్వాసాన్ని పోగొడుతుంది! క్షమించు!'

ఆమె కోపంగా వెళ్ళిపోయింది. ఆ కోపంలో ఆమె మొహం బాగా ఎర్రబారిపోయింది. ఆ మొహం ఇప్పటికీ నాకు ఎంత స్పష్టంగా గుర్తుందో!

మరో అరగంటలో సృజన నా గదిలోకి వచ్చేస్తుంది! ప్రతిదానికీ మంచి ముహూర్తాలు పెడతారు మనవాళ్ళు! పదకొండు గంటల అయిదు నిమిషాలకు మాత్రమే ఆమె ఈ గదిలోకి రావడానికి మంచిదట! ఇప్పుడే శృంగారంగా నా మదిలోకి ఎందుకు రాలేకపోతోంది!? సన్నగా పొడవుగా వున్న సృజన వేళ్ళు ఎంత కళాత్మకంగా వున్నాయో!

బి.ఇ. పరీక్ష ఫస్ట్ ర్యాంకులో పాసయ్యాను. నా తల్లిదండ్రులూ, కుటుంబ సభ్యులూ నా కంటే ఎక్కువగా సంతోషించేరు. వనజ ఫస్ట్ క్లాసులో పాసయ్యింది. ఆమె తన విజయంపట్ల కంటే నా విజయం పట్ల ఎక్కువ సంతోషం వ్యక్తం చేసింది.

పూర్ వనజ! కాదు కాదు రిచ్ వనజ!

మంచి పేరుకల కంపెనీవారు నాకు వెంటనే ఉద్యోగం ఇచ్చేరు. సింగపూర్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ కూడా పంపించేరు. ఆ తర్వాత అమెరికాలో మంచి ఉద్యోగం దొరికింది. ఉద్యోగం చేస్తూ అమెరికాలో మంచి యూనివర్శిటీలో ఎం.బి.ఎ.చేశాను. ఆ తర్వాత అమెరికాలోనే పెద్ద కంపెనీలో మంచి ఉద్యోగం

దొరికింది. నెలకి ఇంచుమించుగా ఎనిమిదివేల అమెరికన్ డాలర్లు ఇస్తున్నారు. నా జీతంతో మా కుటుంబం కొంతవరకూ చాలా వరకూ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడింది.

ఛీ! ఛీ! ఛీ! ఈ ఆలోచన్లు అన్నీ ఇప్పుడెందుకు? సృజనా! సౌందర్యవంతమైన నీ చిలిపి ముఖ చిత్రాన్ని నా మనసులో నిలబెట్టుకుని ఆడుకోవాల్సిన మధురక్షణాలను వృధాచేసుకుంటున్నానా! వనజా! కాదు కాదు! సృజనా! హంసలా శృంగారంగా నడుచుకుంటూ నా మనసులో ప్రవేశించవా!? నాలోని ప్రేమ ఏమైపోయింది! నాలోని శృంగారం ఏమైపోయింది! అమెరికన్ డాలర్ తినేసిందా?

అమెరికన్ డాలర్ అంటే మరోమాట గుర్తుకు వస్తోంది. నేను ప్రేమించే విశాఖలో ఇల్లు కట్టేను. నాకు జీవితంలో అత్యంత సంతోషకరమైనది వొకటి వుంది. ఆర్థిక ఇబ్బందుల్లో నలిగిపోయిన నా తల్లితండ్రులు వారి ఆఖరి దశను సుఖంగా ఆ ఇంట్లో మనుమలతో, మనుమరాళ్ళతో ఆడుకుంటూ స్వేచ్ఛగా గడుపుతున్నారు. ఏ పుత్రుడికైనా అంతకంటే గొప్ప ఆనందం ఏమి వుంటుంది? అందుకే నేనింత వరకూ పెళ్ళి చేసుకోలేదు.

పెళ్ళి చూపుల నాడే సృజనతో నా ఆలోచన్లు చెప్పేశాను. నా జీతాన్ని నేను నా కుటుంబ సభ్యులందరికీ ఎంతో కొంత ఉపయోగిస్తూ వుంటాను. కొందరు పేద విద్యార్థులకు నా డబ్బుతో పెద్ద చదువులు చెప్పిస్తాను. నా ఆలోచన్లకు నువ్వు అడ్డు రాకూడదు. నా తల్లిదండ్రుల పట్ల నాకు బాధ్యత వుంది. ఆ బాధ్యతలో నేను విఫలమైతే, నేను జీవితంలో విఫలమైనట్టు అనుకుంటాను. నీ ఆలోచనల్లకు నేను కూడా అడ్డురాను. నువు నీ కుటుంబానికి సాయం చేయాలనుకుంటే, కష్టపడి ఉద్యోగం చేసి సంపాదించి నీ జీతంలోంచి మాత్రమే సాయం చేయాలి. నా జీతంలోంచి కాదు" ఈ మాటలు సృజనకు స్పష్టంగా చెప్పేశాను.

మరో పావుగంటలో సృజన నా గదిలోకి వచ్చేస్తుంది! మెత్తగా అడుగులు వేసుకుంటూ చల్లగా దొంగలా నా గదిలో ప్రవేశిస్తుంది!

దొంగలా!? అవును! దొంగలా వనజ మళ్ళీ నా మనసులో ప్రవేశిస్తోంది! ఆమెతో నాకేమి సంబంధం వుంది!? ఆమెకు నాతో ఏమి సంబంధం వుంది!? బి.ఇ. ఆఖరి పరీక్ష రాసాక విశాఖ బీచ్‌లో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నాను.

దొంగలా-అవును! దొంగలా వచ్చి వనజ నా పక్కన నిలబడింది. తర్వాత కొద్దిగా దూరంగా కూర్చుంది.

'పిల్ల గాలి తగలకుండా నేను నీకు దూరంగానే కూర్చున్నాను!'

'మంచిపనేచేశావు! మరి కొద్దిగా దూరంగా వెళ్ళి కూర్చో!'

'విశాఖ క్రిష్ణా కాలేజిలో రెండేళ్ళు కలిసి చదువుకున్నాం. ఇంజినీరింగ్ కాలేజిలో నాలుగేళ్ళు కలిసి చదువుకున్నాం. జ్ఞాపకార్థం ఒకటి అడుగు తాను! ఇస్తావా!'

'వీలుంటే........'

'తియ్యటి ముద్దు!'

నేను ఆశ్చర్యపోయాను! నా నోటివెంట మాట రాలేదు! మౌనంగా ఉండిపోయాను!

'మంచి పనే చేశావు! తొందరపడి ముందుకు వస్తే, చెప్పుతీసి కొడదామనుకున్నాను!' అని పకపక నవ్వుతూ దోసిడి నిండా ఇసుక తీసి మూడుసార్లు నా నెత్తిమీద పోసి పక పక నవ్వుకుంటూ పారిపోయింది! అంతే! ఆ తర్వాత వనజ గురించి నాకేమి తెలీదు.

అమెరికా నుంచి విశాఖ వచ్చి ఇరవై రోజులు అయింది. మరో పదిరోజుల్లో మళ్ళీ సృజనతో అమెరికా వెళ్ళిపోతాను. మరో పదినిముషాల్లో సృజన శృంగారంగా నా గదిలోకి వస్తుంది! విశాఖ వచ్చిన మర్నాడే సృజనను చూశాను. ఆమె ఎవరో అంతకుముందు నాకు తెలీదు. నేను ఆమెను చూశాను. ఆమె నన్ను చూసింది. పరిచయం చేసుకున్నాం. మాట్లాడుకున్నాం. ఆమె నాకు నచ్చింది. నేను ఆమెకు నచ్చాను. పెళ్ళి నిశ్చయం అయిపోయింది. అంతా ఒక గంటలో జరిగిపోయింది. ఆ తర్వాత నేను ఇంజినీరింగు కాలేజికి వెళ్ళేను. ప్రొఫెసర్లూ, విద్యార్థులూ నన్ను మాట్లాడమని సభ ఏర్పాటు చేశారు. హాలంతా విద్యార్థులతో నిండిపోయింది. సభ బాగా జరిగింది. సభ ముగిసేక బయటకు వచ్చేను. వనజను చూశాను. ఆమె సంతోషంతో ముందుకి గబగబా వచ్చి నన్ను పలకరించింది. భర్తకు పరిచయం చేసింది. పిల్లలను పరిచయం చేసింది. చిరునవ్వులతో కొంతసేపు మాట్లాడుకున్నాం.

వనజ భర్త బాగా చదువుకున్నవాడు. ఇంజినీరింగు డిగ్రీ, మేనేజిమెంటు సైన్స్‌లో పి.జి. డిగ్రీ చేశాడు. చాలా అందంగా హుందాగా వున్నాడు. సొంత ఫ్యాక్టరీ వుంది. చక్కని వ్యక్తిత్వం ఉన్నవాడు. వనజకు మంచి భర్త దొరికినందుకు చాలా సంతోషించాను. ఆ విషయం ఆమెకు చెప్పేశాను కూడా.

'ఇతడు నీలాగ కాదు!' ఆమె చిలిపిగా చెబుతూ పకపక నవ్వేసింది. అతడు ఏదో చెప్పబోయాడు. 'ఆగు! గొప్పలు చెప్పుకోకు! నీకు స్త్రీ శరీరమే కాని "స్త్రీ" అక్కర్లేదు!' ఆమె నవ్వుతూ చిలిపిగా చెప్పేసింది. ఆమె మాటలు విన్నాక అతడు మరీ ఉత్సాహంగా కనిపించేడు!

ముహూర్త మధురక్షణం దగ్గర పడుతోంది. ఎంత ఆహ్వానించినా సృజన నా మనసులో ప్రవేశించి మధురమైన ప్రేమమయ శృంగారభావజాలంతో నా మనసును నింపలేకపోయింది! అది ఆమె తప్పుకాదు. అది నా లోపం!

తల్లిదండ్రులకు దూరంగా, కుటుంబ సభ్యులకు దూరంగా స్నేహితులకు దూరంగా, విశాఖకు దూరంగా ఒంటరిగా వున్న నేను కామాన్ని రెచ్చకొట్టే నీలిబొమ్మలు చూసే దుర్వ్యసనానికి గురైపోయాను! బలైపోయాను! సృజన నా మనసులో మెదిలినప్పుడల్లా, నీలిబొమ్మలు తెరలు తెరలుగా నా కళ్ళముందు రంగురంగుల చిత్రాల్ల కదులుతున్నాయి! స్త్రీ పురుషులు నగ్నంగా కలవడం - శరీరంలోని ప్రతి అంగం, అవయవం స్పష్టంగా నా కళ్ళముందు దృశ్యంలా కదులుతున్నాయి! స్త్రీ పురుషుల కలయికలో ప్రతి కామ చర్య ప్రతి కదలికా- స్పష్టమైన దృశ్యంలా నా కళ్ళముందు మెదులుతున్నాయి. అవన్నీ నా కామాన్ని మాత్రమే రెచ్చకొడుతున్నాయి. సృజనలోని ప్రేమమయ శృంగారభరితమైన స్త్రీ నా మధురభావనలోకి రాకుండా నీలి చిత్ర దృశ్యాలు అడ్డుకుంటున్నాయి!

పదకొండు గంటల అయిదు నిమిషాలు అయిపోయింది. తలుపు నెమ్మదిగా చప్పుడైంది. సృజన మెత్తగా అడుగులు వేసుకుంటూ, యవ్వనపు పరిమళాన్ని వెదజల్లుతూ గదిలోకి వచ్చి తలుపు మూసివేసింది. ప్రేమమయ శృంగారపు చిరునవ్వుల వెన్నెలతో గదిని నింపేస్తోంది.

మరి నేను!?

ప్రేమ లేదు! శృంగారం లేదు! ప్రేమమయ శృంగారం లేదు!

కామం! కామం! ఒళ్ళు తెలీని కామం! పశుకామం!

నీలి బొమ్మల దృశ్యాలు వడివడిగా నా కళ్ళముందు కదులుతున్నాయి!

నీలి బొమ్మలు చాలా హానికరమైనవని తెలుసుకుంటున్నాను!

నీలి బొమ్మలు యువకులను నిజమైన ప్రేమమయ శృంగార సంసార జీవితానికి దూరం చేస్తాయని తెలుసుకుంటున్నాను!

స్త్రీ శరీరమేకాని 'స్త్రీ' అక్కర్లేని యువకులను నీలి బొమ్మలు తయారుచేస్తున్నాయి!

ఇవాళ మన వెండితెర - బుల్లితెర - కూడా నీలి చిత్రాల్లా వుంటున్నాయి! డబ్బే కాని సమాజం పట్ల ప్రేమా బాధ్యతా లేని నేరస్తులే వారంతా!

★ ★ ★

(సుప్రభాతం - వారపత్రిక - 27.01.2001)